www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 18 | మార్చి | 2026
పేజీలు : 8

## అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి




సెంటర్ స్ప్రెడ్

ఎంఎల్ఎ కూనంనేని సహకారంతో అభివృద్ధి చేసుకుందాం
- గైర్హాజరైన మున్సిపల్ అధికారులు
-ఆగ్రహం వ్యక్తం చేసిన మేయర్

## వసతి గృహాల్లో..
# విషాహారం..!

-విద్యార్థుల పాలిట శాపంగా మారిన నిర్లక్ష్యం
-వరుస ఘటనలతో తల్లిదండ్రుల్లో భయాందోళన
-కొరవడిన పర్యవేక్షణ

**ప్రజాపక్షం/ఖమ్మం :** వరుస ఘటనలు సంక్షేమ వసతి గృహ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళన నెలకొంది. విష ఆహారం విద్యార్థుల ప్రాణాల మీదకు తెస్తుంది. వసతి గృహాల సిబ్బంది వ్యవహార తీరు ఈ పరిస్థితికి కారణమవుతుంది. పేదలు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు తమ పిల్లలను సంక్షేమ వసతి గృహాలకు పంపుతున్నారు. సిబ్బంది అన్ని తామై పిల్లలను సంరక్షించాల్సిన పరిస్థితి ఉండగా అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. చాలా వసతి గృహాల్లో క్రమశిక్షణ లోపించిందన్న ఆరోపణలు ఒక పక్క మరో పక్క ఆహారం విషతుల్యమై విద్యార్థులు ఆసుపత్రుల పాలు కావడం సంక్షేమ వసతి గృహాలపై అపనమ్మకాన్ని పెంచేవిధంగా ఉంది. దమ్మపేట, మణుగూరులో జరిగిన ఘటనలు మరువక ముందే ముదిగొండ మండలంలో చోటు చేసుకున్న ఘటన ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. వసతి గృహాల బాధ్యులు ఆహారం విషయంలో సరైన నియమాలను పాటించకపోవడం, మెనూను సరైన పద్ధతిలో అమలు చేయకపోవడమే ఇందుకు కారణమన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఎప్పుడో ఒకసారి ఎక్కడో ఒక చోట జరిగిందంటే పొరపాటునో జరిగి ఉండవచ్చునని భావించవచ్చు. కానీ ఉమ్మడి జిల్లాలో వరుస ఘటనలు చోటు చేసుకోవడం పదుల సంఖ్యలో విద్యార్థులు ఆసుపత్రుల పాలు

మిగతా 2లో..


(ఫైల్)


(ఫైల్)

## గిర్రున తిరుగుతున్న మీటర్లు..!



- వేసవిలో పెరిగిన విద్యుత్ వినియోగం
- జిల్లాలో మొత్తం కనెక్షన్లు 4,68,036
- రోజుకు సరాసరి 6.47 మిలియన్ యూనిట్ల వినియోగం
- రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** వేసవి కాలం మొదలైందో లేదో భానుడు ప్రతాపాన్ని చూపుతున్నాడు. దీంతో జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 38 నుండి 39 డిగ్రీలుగా నమోదవుతుండటంతో గృహావసరాల వినియోగం పెరిగిపోయింది. అంతే కాకుండా కమర్షియల్, వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్ వినియోగం కూడా అదే బాటలో ఉంది. వ్యవసాయానికి 24 గం. పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్న క్రమంలో రైతులు పంటలకు తడు లు పెట్టుకునేందుకు విద్యుత్‌ను వినియోగిస్తూ బోర్లు వాడుతూ పంటలను రక్షించుకుంటున్నారు. వేసవి కాలం మొదలు కావడంతో ప్రజలు 12 గం. వరకు ఇళ్లకు చేరుకుని సాయంత్రం 5 గం. వరకు బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఇళ్లలో చల్లదనం కోసం కూలర్లు, ఏసీలు వాడుతూ ఉపశమనం పొందుతున్నారు. దీంతో విద్యుత్ డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఈనెల మొదటిన జిల్లా వ్యాప్తంగా 6.036 మిలియిన్ విద్యుత్ యూనిట్లు వినియోగం జరగగా, 5వ తేది నాటికి 6.39 మిలియన్ యూనట్లకు చేరుకుంది. 10వ తేది నాటికి

మిగతా 2లో..

## ఖమ్మంరూరల్ డిసిసిబిలో లోన్ స్కాం..!




- గూడూరుపాడులో నకిలీ పాస్‌బుక్కుల గుట్టు రట్టు
- అధికారుల మెడకు ఉచ్చు
- డిసిసిబి సీఈఓకి ఫిర్యాదు చేసిన రామ్మూర్తి
- విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండల డిసిసిబిబ్యాంక్ లోన్ స్కాం కలకలం రేపుతోంది. గూడూరుపాడు రెవెన్యూలోని ఓ భూమి మ్యూటేషన్ అక్రమ వ్యవహారానికి తెరతీసింది. భూమి లేకున్నప్పటికీ పిట్టల వారిగూడెంలోని సర్వేనెంబర్లు 71/1,1,45,59,64లపై నకిలీపాస్ పుస్తకం పొంది దాని ద్వారా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుటుంబ సభ్యులపై లోన్ పొందిన ఘటన వెలుగుచూసింది. దున్నపోతు ఇనిందంటే పాలు పితుకు అన్న చందంగా డిసిసిబి అధికారులు మార్ట్‌గేజ్ తీసుకొని లోను మంజూరు చేయడం సంచలనంగా మారింది. ఈ ఘటపై ఆ గ్రామానికి చెందిన రామ్మూర్తి అనే వ్యక్తి డిసిసిబి సీఈఓకు కలిసి నేరుగా ఫిర్యాదు చేయడం అక్రమ బాగోతానికి అద్దం పట్టింది. ఈ వ్యహారంతో పాటు డిసిసిబిలో ఇచ్చిన లోన్లపై విచారణ చేస్తే మరిన్ని అక్రమ వ్యవహారాలు వెలుగులోకి వస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

### ఆందోళనలో రైతులు...

అక్రమ పద్ధతిలో భూమి ఎక్కించుకొని లోన్ పొందిన వ్యవహారం వెలుగులోకి రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. తమ ఆధీనంలో ఉన్న భూమి ఇతరులపై ఎలా రికార్డ్ అయ్యిందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఎలా? తమకు తెలీకుండా సాధ్యమైందంటూ ఆందోళనతో పాటు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో అధికారులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది రైతులు ఇప్పటికే తమ భూమి

మిగతా 2లో..

# వసతి గృహాల్లో విషాహారం..!

(మొదటిపేజీ తరువాయి)
కావడం జరుగుతుంది. ఒక ఘటన చోటు చేసుకున్న తర్వాతనైనా అధికార యంత్రాంగం అప్రమత్తం కావాల్సి ఉండగా ఆ పని చేయడం లేదు. విద్యార్థులకు నిత్యం ఏమి వండి వడ్డిస్తున్నారు, వసతి గృహాల్లో పరిశుభ్రత, సిబ్బంది హాజరు తదితర విషయాలపై ఆయా శాఖల అధికారులకు పట్టింపు లేకుండాపోయింది. క్షేత్ర స్థాయి సిబ్బంది మొదలు ఉన్నతాధికారుల వరకు ఉన్న ఆర్థిక సంబంధాలు క్షేత్ర స్థాయి సిబ్బందిని సరిగ్గా పనిచేసేలా చేయలేకపోతున్నాయి. విద్యార్థుల ప్రాణాల మీదకు వస్తున్నా తగు రీతిలో స్పందించడం లేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతం చేసుకోవచ్చు. ఆహారం విషతుల్యమై విద్యార్థులకు వాంతులు, విరోచనాలు అనగానే ఆగమేఘాల మీద ఘటన స్థలికి చేరుకోవడం, ఒకరినో ఇద్దరినో విధుల నుంచి తప్పించి చేతులు దులుపుకోవడం ఇప్పుడు సంక్షేమ అధికారులకు అలవాటుగా మారింది. విధుల నుంచి తప్పించిన వారిని రెండు మూడు నెలల్లో తప్పించిన వారే విధుల్లోకి తీసుకుని మీకు మేమున్నాం మీరు ఏమైనా చేయండి అంటూ బాసటగా నిలిచినట్లు ఉంది పరిస్థితి. మార్చి మాసంలోనే మూడు ఘటనలు ఉమ్మడి జిల్లాలో చోటు చేసుకున్నాయి. ఆ తర్వాతనైనా నిరంతర పర్యవేక్షణ ఉండా అంటే అది కొరవడింది. విద్యాభ్యాసన గురించి పక్కనపెడితే మిగిలిన అన్ని విషయాల్లో సంక్షేమ హాస్టళ్ల వైఫల్యాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. తమ పిల్లలను ఇంటి వద్ద ఉంచుకుని చదివించే పరిస్థితులు లేక ప్రైవేటు పాఠశాలలకు పంపే ఆర్థిక స్థోమత లేక సంక్షేమ వసతి గృహాలను ఆశ్రయిస్తే చివరకు చదువు సంగతి ఏమో కానీ ప్రాణాలు పోయే పరిస్థితి దాపురించింది. మెనూ అమలుపై ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యార్థి సంఘాల ఆందోళనలకు, వినతి పత్రాలకు సైతం అధికారులు స్పందించడం లేదు. ప్రజాప్రతినిధులు పెద్ద పెద్ద మాటలు చెబుతున్నారు తప్ప సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణపై అధికారులను ప్రశ్నించడం లేదు. చదువు సంగతి వదిలిపెట్టి కొందరు విద్యార్థులు గాడితప్పి మత్తు పదార్థాలను సేవించి హల్‌చల్ చేస్తుండగా కొందరు వేధింపులకు గురై ప్రాణాలను తీసుకుంటున్నారు. మొత్తం సంక్షేమ వసతి గృహ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ఈ విద్యా సంవత్సరం ముగుస్తున్న క్రమంలో వేసవిలో వసతి గృహాల పనితీరు మెరుగుదల, ఇతరత్రా వ్యవహారాలపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. తప్పిదాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు భవిష్యత్తులో తిరిగి ఉద్యోగానికి వచ్చే అవకాశం లేకుండా చర్యలు ఉంటే తప్ప మేలు జరిగే పరిస్థితి లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆ దిశగా అధికారులు తగు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

# గిర్రున తిరుగుతున్న మీటర్లు..!

(మొదటిపేజీ తరువాయి)
అది 6.47 మిలియన్ యూనిట్లకు, 15వ తేది నాటికి 6.69 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. ఇదిలా ఉండగా జనవరి, ఫిబ్రవరి నెలలతో పోలిస్తే భారీగానే విద్యుత్ వినియోగం పెరిగింది. జిల్లాకు ప్రతీ రోజూ కోటా 6.85 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుతం 6.39 మిలియన్ యూనిట్ల వినియోగం సరాసరి జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**జిల్లా వ్యాప్తంగా ఇలా...**
జిల్లా వ్యాప్తంగా 132/33 కెవి సబ్ స్టేషన్లు 12 ఉండగా, 132/11 సబ్ స్టేషన్లు 77 ఉన్నాయి. జిల్లాలో మొత్తంగా 4,68,036 విద్యుత్ కనక్షన్లు ఉండగా, వీటిలో3,51,588 గృహ కనక్షన్లు, 60,800 బోరు కనక్షన్లు, 43,716 వాణిజ్య కనక్షన్లు, 2,094 పరిశ్రమల కనక్షన్లు, వీధిదీపాలకనక్షన్లు 3,795, స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లు, దేవాలయాలకు చెందిన కనక్షన్లు 3,738, తాత్కాలిక కనక్షన్లు 381, ఎలక్ట్రిక్ వాహనాల విద్యుత్ చార్జింగ్ కనక్షన్లు 08 ఉన్నాయి.

## 18 నుండి 20 వరకు ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ పర్యటన

ప్రజాపక్షం/భద్రాచలం : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఈనెల 18 నుండి 20 వరకు మూడ్రోజుల పాటు భద్రాచలంలో పర్యటిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుంటారని, అనంతరం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియాన్ని సందర్శించి ఐటిసి పిఎస్‌పిడిలో రాత్రి బస చేస్తారని చెప్పారు. 19వ తేది ఉదయం భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పాపికొండల సందర్శనకు వెళతారన్నారు. రాత్రి ఐటిసి పిఎస్‌పిడిలో బస చేసి మరుసటి రోజు20వ తేది ఉదయం హైదరాబాద్‌కు బయలు దేరుతారని చెప్పారు.

# ఖమ్మంరూరల్ డిసిసిబిలో లోన్ స్కాం..!

(మొదటిపేజీ తరువాయి)
రికార్డులను ఆన్‌లైన్‌లో పరిశీలించడం ప్రారంభించగా, మరికొందరు తహశీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ తీరుతో నిజమైన రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని రైతు సంఘాలు హెచ్చరిస్తున్నాయి. వెంటనే పూర్తి స్థాయి విచారణ చేసి, అసలు యజమానుల హక్కులను రక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులపై అనుమానాలు...**
ఈ వ్యవహారంలో ఖమ్మంరూరల్ డిసిసిబి అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లోన్‌కు దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి సంబంధించిన ఫీల్డ్ స్థాయి ఎంక్వైరీ తప్పనిసరిగా ఉండాల్సి ఉన్నప్పటికీ, అధికారులు ఇవేమి పాటించలేదని తెలిసింది. కేవలం అమ్మాయ్యాల కోసమే తూతూ మంత్రంగా ఒక సర్వే నెంబర్ వద్ద ఫోటో దిగినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఇటువంటి పాస్‌బుక్స్ ఆధారంగా పెద్ద ఎత్తున్న బ్యాంక్‌లోన్లు ఇచ్చినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. అక్రమానికి సక్రమ సహకారాన్ని అందించిన అధికారుల పాత్రపై లోతైన విచారణ అవసరమని ప్రజలు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా అడ్డగోలు వ్యవహారం బైటకివచ్చిన నాటి నుంచి అధికారులు తప్పు మీద తప్పు చేస్తూ మరింత ఇరకాటంలో పడుతూ వారి మెడకు వారే ఉచ్చు బిగించుకుంటున్నారు.

**విచారణచేస్తే మరిన్ని వెలుగులోకి...**
అడ్డగోలు వ్యవహారంపై అధికారులు కఠిన చర్యలకు దిగితే, ఇదే తరహా మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని, పలువురు పేర్కొంటున్నారు.ఈ అక్రమాలు ఈ ఒక్క గ్రామానికి పరిమితం కాలేదని, ఇతర గ్రామాల్లో కూడా ఇలాంటి తప్పుడు వ్యవహారాలు జరిగి ఉండవచ్చని ప్రజలు తెలుపుతున్నారు. ఈ తప్పిదంపై లోతుగా విచారిస్తే , సంబంధిత అధికారుల పాత్ర, మరిన్ని అక్రమ లావాదేవీలు బైటపడే అవకాశం ఉందని రైతులు వర్గాలు చెబుతున్నాయి. సామాన్యుడికి సవాలక్షల కొర్రీలు చూపించే బ్యాంకులు అక్రమ వ్యవహారానికి ఎలా వత్తాసు పలికారని ప్రశ్నిస్తున్నారు. ఇందులో ఆమ్యామ్యాలు పెద్ద ఎత్తున ముట్టడంతోనే ఈ అడ్డగోలు వ్యవహారానికి పూనుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఈ ఘటనను ఒక్క కేసుతో సరిపెట్టకుండా మొత్తం వ్యవస్థను పరిశీలించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు ఎంత వేగంగా, ఎంత పారదర్శకంగా విచారణ చేపడతారన్నది కీలకంగా మారింది.

## డ్వాక్రా డబ్బులు స్వాహా
### విచారణ చేపట్టిన మెప్మా అధికారులు



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో డ్వాక్రా కట్టిన డబ్బులు పూర్తిస్థాయిలో జమ చేయకుండా మోసం చేశారని డ్వాక్రా గ్రూపు సభ్యులు మంగళవారం వైరాలో మున్సిపాలిటీ నందు మెప్మా కార్యాలయం నందు మున్సిపాలిటీ నందు మెప్మా కార్యాలయం నందు ఫిర్యాదు చేశారు. గ్రూప్ సభ్యులందరూ ఒకేసారి వచ్చి డబ్బులు కట్టకుండా కొన్ని వాడుకొని మోసం చేశారని గ్రామదీపిక నిలదీయడంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకొని అందరికి అది చెప్పారు. అనంతరం మెప్మా వెంకటేశ్వరావు బ్యాంకు వద్దకెళ్లి విచారణ చేపట్టారు. విచారణలో ఒక గ్రూపుకు చెందిన గ్రూప్ సభ్యులు నాలుగు లక్షల రూపాయలు బ్యాంకులో జమ చేయడానికి గ్రామదీపిక ఇస్తే అందులో రూ.3లక్షలు జమ చేసి లక్ష రూపాయలు వాడుకున్నట్లు విచారణలో తేలింది. అనంతరం వెంకటేశ్వరరావు పూర్తిస్థాయిలో గ్రామదీపిక పరిధిలోని గ్రూపుల్లో విచారణను బుధవారం వైరాలోని రైతువేదిక నందు విచారణ చేపట్టనున్నారు. అయితే ఇప్పటికే పలువురు గ్రూప్ సభ్యులు మెప్మా వెంకటేశ్వరరావుకు తమ గ్రూపులో డబ్బులు కూడా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని వాస్తవాలు తెలపాలని కోరనున్నట్లు తెలుస్తుంది.

# ఉపాధ్యాయినీలపై మానసిక వేధింపులు..!

**- జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న వైనం**
**- షైన్ హైస్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎంఇఒకు ఫిర్యాదు**



ప్రజాపక్షం/ బోనకల్ : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన విద్యాలయాలు ఇప్పుడు ఉపాధ్యాయులను వేధించే అడ్డగా మారింది. స్థానిక షైన్ హైస్కూల్ యాజమాన్యం మహిళా ఉపాధ్యాయులను దారుణంగా వేధింపులకు గుర్తిచేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం బాధిత ఉపాధ్యాయులు ఎంఇఒ దామాల పుల్లయ్యకు ఫిర్యాదు చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. పాఠశాల యాజమాన్యం కొత్తగా ప్రవేశపెట్టిన స్టూడెంట్ పాలసీ పేరుతో ఉపాధ్యాయులపై పెనుభారం మోపుతున్నట్లు, ఒక్కో ఉపాధ్యాయుడు కనీసం ఒక పేరెంట్ నుండి ఒకలక్ష రూపాయల వరకు పాలసీ పేరుతో వసూలు చేయాలని యాజమాన్యం నిర్దేశించినట్లు బాధిత ఉపాధ్యాయులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అసాధ్యమైన టార్గెట్లను పూర్తి చేయని పక్షంలో ఉపాధ్యాయులకు రావాల్సిన నెలవారీ జీతాలను ఆపివేస్తామని యాజమాన్యం బెదిరింపులకు దిగుతున్నట్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. డబ్బులు వసూలు చేయడం లేదన్న నెపంతో మహిళా ఉపాధ్యాయుల వ్యక్తిగత ఫోన్ కాల్స్‌ను అక్రమంగా రికార్డ్ చేయడం, ఫోన్లను బలవంతంగా లాక్కొని అందరి ముందు మెసేజ్‌లను తనిఖీ చేయడం వంటి రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు యాజమాన్యం పాల్పడోతుందని ఉపాధ్యాయులు ఆరోపించారు. సీనియర్ ఉపాధ్యాయులని కూడా చూడకుండా అనుచిత పదజాలంతో దూషించడం, మానసిక వేధింపులకు గురిచేయడం వల్ల పాఠశాలలో పనిచేయలేని పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. వెంటనే ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ఉపాధ్యాయులను వేధిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు రావాల్సిన జీతాలు ఇప్పించాలని బాధితులు విన్నవించారు.

ఎంఇఒ వివరణ : షైన్ హైస్కూల్ ఉపాధ్యాయులు ఇచ్చిన వినతిపత్రంపై సమగ్ర విచారణ జరిపి జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు ఎంఇఒ దామాల పుల్లయ్య తెలిపారు.

## వైరా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లీం సోదరులకు వైరా మజీద్ నందు ఇఫ్తార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీదులో ముస్లీం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాప అమురళీకృష్ణ, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంగారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, తెలుగుదేశం పట్టణ కార్యదర్శి బొల్లేపల్లి శ్రీను, వేముల రత్నాకర్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అప్పం సురేష్, పమ్మి అశోక్, నారపునేనిపల్లి సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌రెడ్డి, ఖానాపురం సర్పంచ్ బాలాజి, లయన్ ఐ కేర్ నిర్వాహకులు వుంద్రు శ్యామ్‌బాబు, వేముల రత్నాకర్, కొంగర సుధాకర్, గంగవరపు కిషన్, తోటకూర శ్రీకాంత్, మున్సిపల్ రెవెన్యూ అధికారులు పలు రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల్లో ప్రియదర్శిని విద్యార్థినుల సత్తా



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీలోని 6వ వార్డులో గల ప్రియదర్శిని విద్యార్థినులు ప్రాంగాణ నియామకాలలో మంగళవారం సత్తా చాటారు. ఈ మేరకు క్రియేటివ్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్‌లో వార్షికవేతనం రూ.4లక్షల వేతనంతో నియామకం పొందారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థినులను కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతు, అధ్యాపకులు, ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్లు తివారి, మన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లకు అవగాహన

ప్రజాపక్షం/ ఏరుపాలెం : మండల పరిధిలోని మీనవోలు రైతు వేదిక నందు ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్వాడీ టీచర్లకు మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎసిడిపిఓ కృష్ణశ్రీ, ప్రజ్వల స్వచ్ఛందసంస్థ ప్రతినిధి అనిల్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎసిడిపిఓ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు గ్రామ స్థాయిలో పిల్లలు, మహిళలు ట్రాఫికింగ్‌కు గురికాకుండా ముందుగానే గుర్తించే విధానం, అనుమానాస్పద పరిస్థితులను ఎలా గుర్తించాలి, సంబంధిత అధికారులకు ఎలా సమాచారం ఇవ్వాలి అనే విషయాలపై వివరించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్వాడీ టీచర్లు పిల్లలు కుటుంబాలతో నేరుగా సంబంధం ఉండటం ట్రాఫికింగ్ నివారణలో కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. గ్రామస్థాయిలో అవగాహన పెంచడం ద్వారా అనేక ట్రాఫికింగ్ ఘటనలను ముందుగానే అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి శిక్షణల ద్వారా గ్రామాల్లో పిల్లల భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, హెమ్మీ, సునిత, మధులత, ప్రజ్వల సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# పులిగుండాల నుంచి నీటిని విడుదల చేయండి

**-అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పులిగుండాల ప్రాజెక్టు నుంచి నీటిని తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పెనుబల్లి మండలంలోని పులిగుండాల ప్రాజెక్టు పరిధిలో గల బ్రహ్మలకుంట గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయన్న రైతుల ఆవేదనను గుర్తించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. ప్రాజెక్టు నుంచి సాగునీటిలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి 1,000 ఎకరాలకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పులిగుండాల ప్రాజెక్టు పరిస్థితులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. నీటి విడుదలలో ఉన్న సాంకేతిక, పరిపాలన సమస్యలను గుర్తించి రెవెన్యూ, ఫారెస్టు శాఖలు సమన్వయంతో వాటిని అత్యవసరంగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రం సింగ్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే పరిష్కరించాలని సూచించారు. సాగునీటి విడుదలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని రైతు ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని మంత్రి తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుని నీటిని సత్వరమే విడుదల చేసి పంటలు ఎండిపోకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో నీటి విడుదల ప్రక్రియను అధికారులు ప్రారంభిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మైనార్టీ విద్యార్థికి సీతారత్నం ట్రస్ట్ చేయూత



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నిరుపేద మైనార్టీ విద్యార్థికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ మరోసారి దన్నుగా నిలబడింది. విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించడం, నిరుపేద విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చే లక్ష్యంతో పనిచేస్తున్న ట్రస్ట్ మంగళవారం మరో విద్యార్థికి రూ. 20వేల చెక్కును అందించింది. కొణిజర్లకు చెందిన నిరుపేద మైనార్టీ విద్యార్థి షేక్ ఉస్మాన్ మధ్యప్రదేశ్‌లో ఫోరెన్సిక్ డిగ్రీ చదువుతున్నాడు. కుటుంబ పరిస్థితులు బాగాలేకపోవడంతో ఆర్థిక చేయూతనందించాల్సిందిగా కోరడంతో జిల్లా ఖజానా ఉప సంచాలకులు వై. శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా చెక్కును అందించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సహాయపడే తత్వాన్ని అలవర్చుకోవాలని ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి సూచించారు. విద్యకు తోడ్పాటునందిం చడమంటే సమాజ అభివృద్ధికి దోహదపడటమేనని ఇందులో ముందు వరుసలో నిలిచిన పరిశ సీతారత్నం ట్రస్ట్ సేవలు గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఖజానా ఉప కోశాధికారి బి. నాగేంద్రకుమారి, అధికారులు ఎం. వేలాద్రి, శారద, వై. మంజుల, ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్య, విశ్రాంత ఎంపివో డి. లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# కరాటేలో త్రివేణికి ఛాంపియన్ షిప్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో త్రివేణి పాఠశాల ఓవరాల్ ఛాంపియన్ షిప్‌గా నిలిచింది. రెండు తెలుగు రాష్ట్రాల షోటోఖాన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలను ఎంబి గార్డెన్స్‌నందు వినోద్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో త్రివేణి పాఠశాల విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు గెలుచుకున్నారు. త్రివేణి పాఠశాల కరాటే మాస్టర్ వీరన్న బెస్ట్ రిఫరీ అవార్డుతో పాటు త్రివేణి పాఠశాల ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ కరాటే పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభను కనబర్చాలని కోరారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆట పాటల్లోనే కాకుండా ఇలాంటి స్వీయ రక్షణ విద్యలో కూడా ముందుండాలని తెలిపారు. విజేతలకు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ వినోద్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే స్వీయ రక్షణకు, శారీరక ధృడత్వానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.బహుమతులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ వీరన్న, వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ



**ప్రజాపక్షం/మధిర :** మధిర మండలం రొంపిమళ్ళ గ్రామంలో రంజాన్ పర్వదినం పురస్కరించుకున సర్పంచ్ బజనేని మల్లేశ్వరి ఆంజనేయులు, ఉపసర్పంచ్ తలపురెడ్డి నాగేంద్రశ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్‌తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాలతో రంజాన్ తోఫా (రంజాన్‌కానుక)ను 25 ముస్లిం కుటుంబాలకు పంపణీ చేయటం జరిగిందని తెలి పారు. కార్యక్రమంలో పిజిఓ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి సువర్ణరాజు, గ్రామపెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# వెల్లివిరిసిన మత సామరస్యం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పవిత్ర రంజాన్ మాసంలో జరుపుకునే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. మంగళవారం రాత్రి పట్టణంలోని సింగరేణి కొమ్మేపల్లి కాలనీలో రంజాన్ మాసం సందర్భంగా మసీద్, షేక్ బాజీ నివాసంలో ఇఫ్తార్ విందులు నిర్వహించారు. ఈ విందులకు ముఖ్య అతిదులుగా రాష్ట్ర నాయకుడు డా.మట్టా దయానంద్, ఐఎన్‌టియూసి నాయకులు తీగల క్రాంతికుమార్ లు పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇఫ్తార్ విందుల్లో భిన్నత్వంలో ఏకత్వం ప్రతిభింబిస్తుందన్నారు. రంజాన్ పండుగ క్రమశిక్షణకు , దాతృత్వానికి, సోదరభావానికి నిదర్శనమని కొనియాడారు. ఈ పవిత్ర మాసం అందరి జీవితాల్లో సుఖశాంతులను నింపాలని వారు ఆకాంక్షించారు. సింగరేణిలో మత సామరస్యాన్ని కాపాడడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రముఖులు, మత పెద్దలు,అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు ఈ విందులో పాల్గొని సామూహిక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా, నరసింహ రావు, నాని, వార్డ్ కౌన్సిలర్ ఉప్పు నాగమణి హనుమంతరావు, ఐఎన్టీయూసీ నాయకులు పోగుల నాగేశ్వరరావు, చెరుకు రాజు, రాంబాబు, రమేష్, చార్లెస్, స్థానిక కాంగ్రెస్ నాయకులు కృష్ణా రెడ్డి, బాజీ, ఖలీల్, పటాన్, విసుబ్ ఖాన్, సుభాని, ఖాదర్ బాబా, ఖాజ, దేవళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మహమ్మద్ రిహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, అడిషనల్ డిఎంహెచ్ఓ చందు నాయక్, డా.అవినాష్, మున్సిపల్ కమిషనర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు మహమ్మద్ నసీమా షరీఫ్, బండారు శరత్ చంద్ర, జగన్నాధం శ్రీను, జొన్నలగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొని కార్మికులకు వైద్య సేవలు అందించారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూకలకుంట ఏకగ్రీవం

**వైస్ ప్రెసిడెంట్ మినహా మిగతా పదవులు ఏకగ్రీవం**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** 202627 సంవత్సరానికి నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్ పదవి మినహా మిగతా అన్ని పదవులు ఏకగ్రీవంగా నిర్ణయమైనట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది సుంకర లక్ష్మణరావు మం గళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్ పదవికి జి. శివ రామకృష్ణ, కే. వెంకటేశ్వరరావు పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో అధ్యక్షునిగా సేవలందించిన కూకలకుంట్ల రవి ఈసారి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు తెలిపారు. జనరల్ సెక్రటరీగా సాధు కృష్ణ, జాయింట్ సెక్రటరీగా వి. రామకృష్ణ, ట్రెజరర్‌గా కొప్పుల కేశవరెడ్డి, లైబ్రరీ సెక్రటరీగా ఎన్. విజయకుమార్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రటరీగా జె. నరేంద్ర, లేడీస్ రిప్రజెంటేటివ్‌గా షేక్ జిన్నతునిస్సా ఎన్నికైనట్లు చెప్పారు.అలాగే ఈసీ సభ్యులుగా గుంటూరు శ్రీనివాసరావు, ఎం. నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. మిగిలి ఉన్న వైస్ ప్రెసిడెంట్ పదవికి ఎన్నికను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు తెలిపారు.

# అక్రమ లోన్‌పై డిసిసిబి సీఈఓకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని గూడూరుపాడు రెవెన్యూలోని ఓ అక్రమలోన్‌పై డిసిసిబి జిల్లా సీఈఓకు మంగళవారం ఫిర్యాదు అందింది. ఈ మేరకు గ్రామానికి చెందిన గోకినేపల్లి రామ్మూర్తి లిఖిత పూర్వకంగా బండి మల్లీఖార్జున్ అనే వ్యక్తి అక్రమలోన్ పొందాడని వినతిలో పేర్కొన్నాడు. భూమి లేకపోయినప్పటికీ పిట్లవారిగూడెంలోని సర్వే నెంబర్లు 71/1, 1,45/ఇ, 59/ఇ, 64/ఆ, 53/ఆ రికార్డు ఆధారంగా ఇతరుల భూమిని చూపించి లోన్ పొందినట్టుగా వినతిలో విన్నవించాడు. ఈ తప్పుడు వ్యవహారానికి సహకారం అందించిన ఖమ్మంరూరల్ డిసిసిబి మేనేజర్, సూపర్‌వైజర్లతో పాటు లోన్ పొందిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఈఓ వినతిని రిసీవ్ చేసుకొని, పరిశీలన చేస్తానని తెలిపినట్టుగా రామ్మూర్తి పేర్కొన్నాడు. సంబంధిత భూమికి రైతు బంధును పొందుతున్నాడని, పరిశీలన చేసి నిలిపివేయాల్సిందిగా ఏఈఓకు సైతం వినతి పత్రం ఇచ్చాడు.

# ఎండుతున్న పంటలను కాపాడండి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల కేంద్రంలోని ఎన్‌ఎస్‌పి కార్యాలయం వద్ద తెలంగాణ రైతు సంఘం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరంతరాయంగా సాగునీటిని విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని ఎఇకి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సేలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వారబందీ అని చెప్పి ఇప్పటికి 12రోజులు గడిచినా సాగునీరు విడుదల చేయకపోవడం వలన విపరీతంగా ఉన్న ఎండలకు పెట్టుబడి మొత్తం పూర్తయి చివరి దశలో పంట ఎండిపోతున్నదని, ఇప్పటికే కొంత నష్టం జరిగిందని, అధికారులు వెంటనే స్పందించి నిరంతరాయంగా నీళ్లు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి నల్లమోతు మోహన్‌రావు, మండల అధ్యక్షులు కళ్యాణపు కృష్ణయ్య, అయినాల రామలింగేశ్వరరావు, సత్తెనపల్లి నరేష్, కట్టా దరగయ్య, మన్నేపల్లి అర్జున్‌రావు, ఐలూరి రామిరెడ్డి, కొమ్మినేని రాంబాబు, భూమా శ్రీనివాసరావు, గుండ్ల నాగయ్య, ఉప్పెర్ల నర్సిరెడ్డి, దామారపు బుజ్జి, చల్లా నాగేశ్వరరావు, పులి వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కళ్యాణలక్ష్మి పథకం క్రింద మంజూరైన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. మంగళవారం మండల పరిధిలోని రాంక్యాతండా, ఈర్లపుడి గ్రామాల్లో కళ్యాణ లక్ష్మి పథకం క్రింద లబ్దిదారులకు మంజూరైన చెక్కులను ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ వాంకుడోత్ దీపక్ నాయక్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గుగులోత్ మూర్తి, కేలోత్ గీత, నాయకులు తేజావత్ వెంకన్న, దేవ్‌సింగ్, ఉప సర్పంచ్ శారద తదితరులు పాల్గొన్నారు.

## రెప్పపాటులో తప్పిన ప్రమాదం...!

### ఒక్క అడుగు తేడాతో పెచ్చులూడిన పైకప్పు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఒకే ఒక్క అడుగు బయటకు పడటంతో ఒక్కసారిగా పై కప్పు పెచ్చులూడి పడ్డాయి. దీంతో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మంగా పురంతండా కు చెందిన తేజావత్ కోటేశ్వర రావు ఇంటి పై కప్పు శిధిలావస్థలో ఉండ టంతో పై పెచ్చులూడి పడ్డాయి. మంగళ వారం ఉదయం కోటేశ్వరరావు సతీమణి బుజ్జి భర్త కోటేశ్వరరావు కు భోజనం పెట్టేందుకు ఇంట్లో కి వెళ్లి అన్నం పెట్టుకుని ఒకే ఒక్క అడుగు బయటకు పడింది. అంతే ఒకేసారి భారీ శబ్దం వచ్చింది. ఇంటి పై కప్పు పెద్ద ఎత్తున పెచ్చులూడి పడ్డాయి. పెద్ద పెచ్చులు ఊడి పడటంతో ఉలిక్కిపడి బాధితురాలు భయంతో పరుగులు తీసింది. రెప్పపాటులో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పెచ్చు లు ఇంట్లో సామాన్లు పైపడటంతో అవి దెబ్బతిన్నాయి. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయ పడి చికిత్స పొందుతున్న కోటేశ్వరరావు అప్పటి వరకు ఇంట్లో ఉన్నాడు. కాసేపు బయట ఉందామని అప్పుడే బయటకు వెళ్లాడు. ఆయన కు భోజనం తెచ్చేందుకు వెళ్లిన సమయం లోనే ఈ ప్రమాదం జరిగింది. లేకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

## సింగరేణి సమస్యలపై 17న ఆందోళన

### -31న భారీ ఎత్తున హెడ్ క్వార్టర్ వద్ద ధర్నా చేస్తాం
### -ఏఐటియుసి రాష్ట్ర నాయకులు మిరియాల రంగయ్య



ప్రజాపక్షం/మణుగూరుః సింగరేణి వ్యాప్తంగా కార్మిక సమస్యలు పరిష్కరించక పోతే, సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలో 17న ఆందోళన చేస్తున్నామని ఏఐటియుసి రాష్ట్ర నాయకులు మిరియాల రంగయ్య ప్రక టించారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మిక సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తున్న విధానాన్ని నిరసిస్తూ 6 జిల్లాల్లో 12 ఏరియాలలో సింగరేణి కాల్ లీస్ట్ వర్కర్స్ ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సింగరేణి సంస్థ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 31న సింగరేణి హెడ్ క్వార్టర్ వద్ద భారీ స్థాయిలో అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఆందోళన చేయనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిరియాల రంగయ్య వెల్లడించారు.

## కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణలో అధి కారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యా లయంలో వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలలో ఏ ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని ఆరోపించారు. యువతకు ఉద్యోగ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మీ , గృహ నిర్మాణ పథకం, రైతు భరోసా వంటి ముఖ్య హామీలు ఇప్పటికీ అమలు కావడం లేదని పేర్కొన్నారు. మండలంలో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సమయానికి అందకపోవడంతో అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్య క్షులు బీరక సాయి శ్రీను, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ బాలు నాయక్, జిల్లా నాయకులు బిజ్జం శ్రీనివాసరెడ్డి, చుక్క పల్లి బాలాజీ, కేశగాని శ్రీనివాస్ గౌడ్, యువ మోర్చ నాయకులు బానోత్ వెంకటేశ్వర్లు, గని బోయిన శ్రీను, బిజ్జం వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మేకల నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వెలిశెట్టి రామారావు, జక్కం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి



ప్రజాపక్షం/ తల్లాడ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను నెరవేర్చకుండా సామా న్య ప్రజలను మోసం చేస్తూ బూట కపు హామీలతో పరిపాలన కొనసాగిస్తున్నదని బిజెపి మండల నా యకులు విమర్శించారు. మోసపూరిత హామీలతో ప్రజల్ని మోసం చేయడాన్ని నిరసిస్తూ తల్లాడ తహశీల్దార్‌కి మంగ ళవారం వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో భాగంగా వృద్ధాప్య వితంతు ఫెన్షన్లు రూ.4వేలు పెంచాలని, రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, గ్యాస్ సబ్సిడీని అకౌంట్‌లో వేయాలని, ఆడపిల్లల పెళ్లికానుక తులం బంగారం హామీ అమలు చేయాలని తదితర హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి తల్లాడ మండల అధ్యక్షులు చల్లా నాగులు, మండల ప్రధాన కార్యదర్శులు రాయల రమేష్, పెరిక కిరణ్, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు వేము అశోక్, నాయకులు సమ్మెట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో ఫోర్ వే రోడ్డు పనుల్లో అవకతవకలు..!

### ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు







ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన ఫోర్ వే లైన్ రోడ్డు నిర్మాణ పనులపై గ్రామ ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనులు జరుగుతున్నప్ప టికీ అవసరమైన రేణు కొలతలు(మెజర్‌మెంట్‌లు)ఇవ్వకుండా పనులు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై అధికా రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల వివరాల ప్రకారం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించే ముందు సరైన కొలతలు తీసి, పనుల ప్రణాళికను స్పష్టంగా రూపొందించాల్సి ఉండగా అలాంటి ప్రక్రియను పూర్తిగా పాటించలేదని వారు చెబుతున్నారు. రేణు కొలతలు స్పష్టంగా నమోదు చేయకుండానే పనులు కొనసాగడం వల్ల పారదర్శకత లేకుండా అవక తవకలు జరిగే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థాని కులు మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఇలాంటి పెద్ద పనుల్లో అధికారులు తరచూ పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. కొలతలకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగించకుండా, ఒక్కో చోట ఒక్కో విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విధంగా పనులు కొన సాగితే భవిష్యత్తులో రోడ్డు నాణ్యతపై ప్రభావం పడే ప్రమాదం ఉందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఈ అంశాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకె ళ్లినా ఇప్పటి వరకు సరైన స్పందన లేదని గ్రామస్తులు తెలిపారు. ప్రజల సొమ్ముతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పారదర్శకత, నాణ్యత తప్పని సరిగా ఉండాలని వారు స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు స్పందించి ఫోర్‌వే రోడ్డు పనులను సమగ్రంగా పరిశీలించా లని, అవసరమైన రేణు కొలతలు నమోదు చేసి పనులను పారదర్శ కంగా కొనసాగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఒక వేళ అవక తవకలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డుకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను పక్షపాతం లేకుండా తొలగించా లని డిమాండ్ చేస్తున్నారు.

### సింగరేణి సంస్థను రక్షించేందుకే

## ఏఐటియుసి ఆధ్వర్యంలో సేవ్ సింగరేణి జాత



ప్రజాపక్షం/మణుగూరుః సింగరేణి కాలరి స్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి గుర్తింపు కార్మిక సంఘం కేంద్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మణుగూరు లోని అన్ని మైన్స్, డిపార్ట్మెంట్ల వద్ద హెచ్వో డీలకు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ మిరియాల రంగయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థను రక్షించేందుకు ఏఐటియుసి ఆధ్వర్యంలో సేవ్ సింగరేణి జాతను 18వ తేదీన శ్రీరాంపూర్ లో ప్రారంభిస్తున్నట్లు తెలియజేస్తూ, సింగరేణిలో కార్మికుల సమస్యలు పేరుకపోయి ఉన్నాయని బాధ్యతగల గుర్తింపు కార్మిక సంఘంగా స్ట్రక్చర్ కమిటీ సమావేశాలలో అనేక సమ స్యలు ప్రస్తావించగా యాజమాన్యం ఒప్పుకొని అంగీకరించి అమలు జరపడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కి చెల్లించాల్సిన బకాయిలు రూ. 51,000 వెంటనే చెల్లించాలని అన్నారు. డిస్మిస్ అయిన కార్మికులందరికీ పునర్ నియామకం చేసి మస్టర్ల నిబంధనను తొలగించాలని అన్నారు. కార్మికులకు సంబంధించిన అన్ని క్యాడర్ స్కీమ్ సమీక్షించి సవరించాలని అన్నారు. కార్మికుల కు సూపర్ స్పెషా లిటీ హాస్పిటల్ వైద్య సదుపాయం హైదరాబాద్ లో కల్పించాలని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించా లని అన్నారు. సంస్థ రక్షణకై మనుగడ కోసం ఏఐటియుసి ఆధ్వ ర్యంలో సేవ్ సింగరేణి జాత మార్చి 18న ప్రారంభమై సింగరేణిలోని 12 డివిజన్లో నుండి అన్ని బావులలో కార్మికులను చైతన్యపరచి మార్చి 30వ తేదీన కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహి స్తున్నామని అన్నారు. కార్మికులందరూ ఈ యొక్క సేవ్ సింగరేణి జాతాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో మేకల ఈశ్వర్ రావు అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ, ఎం.వి.రాం నర్సయ్య గారు వైస్ ప్రెసిడెంట్, ఆఫీస్ బేరర్ లు ఆవుల నాగరాజు, ఆధర్ల సురేందర్, గోలి గంగాధర్ రావు, బి సురేందర్ రావు, శనిగరం కుమారస్వామి, ఆడెపు రాజశేఖర్, ఫీట్ సెక్రటరీలు అంతోటి రవికు మార్, గుంపెన శ్రీనివాసరావు, సాయి ప్రకాష్ చారి, బి రవి, జానకి ప్రసాద్, రాజేందర్, మిట్టపల్లి వెంకటేశ్వర్లు, దరిపల్లి వెంకటేశ్వర్లు, ఇమాముద్దీన్, కిషోర్ బాబు, తెన్నేటి నారాయణ, వైరి వెంకటేశ్వర్లు, దండు విజయ్ పాపారావు, నాగుల సతీష్ హుస్సేన్, కళ్యాణం రవి తది తరులు పాల్గొన్నారు.

## రైల్వే లైన్ భూసేకరణపై జెసితో సమావేశం

### -పరిహారం రేట్లపై లేని ఏకాభిప్రాయం



ప్రజాపక్షం/కారేపల్లి: డోర్నకల్, భద్రాచలం రోడ్ రైల్వే లైన్ డబ్లింగ్ పనుల కోసం భూసేకరణకు సంబంధించిన పరిహారం రేట్లపై మంగళ వారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజే శ్వరి, సింగరేణి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు పాల్గొన్నారు. ఈసమావేశంలో పరిహారం రేట్లపై తీవ్ర చర్చ జరిగినప్పటికీ, నిర్ణయం కొలిక్కి రాలేదు. వ్యవసాయ భూములకు ఎకరానికి రూ 91లక్షలు, ఇళ్ల స్థలాలకు గజానికి రూ 20వేల చొప్పున పరిహారం ఇవ్వాలని బాధి తులు డిమాండ్ చేశారు. అయితే అధికారులు ఆ రేట్లు సాధ్యం కాదని పేర్కొంటూ, ఎకరానికి రూ 18లక్షలు, గజానికి రూ 6300 మాత్రమే చెల్లిస్తామని స్పష్టం చేశారు. నిర్మించిన ఇళ్లకు సంబంధించి ఆర్అండ్‌బి శాఖ అంచనాల ప్రకారం అదనపు పరిహారం కలిపి ఒక బాధితుడికి సుమారు రూ 46లక్షలు వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరిం చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలైన రేట్లనే ఇక్కడ కూడా అమలు చేస్తా మని చెప్పారు. అయితే నాన్ ఏజెన్సీ ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని నిర్వాసితులు కోరారు. ఈ అంశంపై మరోసారి సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. తమకు న్యాయమైన పరి హారం చెల్లించాలని కోరుతూ సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వాసితులు జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిం చారు. ఈసమావేశంలో తహసీల్దార్ రమేష్, రైల్వే జేఈ శ్రీకాంత్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

### - ఎంఎల్ఏ కూనంనేని సహకారంతో అభివృద్ధి చేసుకొందాం
### - గైర్హాజరైన మున్సిపల్ అధికారులు
### -ఆగ్రహం వ్యక్తం చేసిన మేయర్



ప్రజాపక్షం/పాల్వంచ : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమా లలో ప్రజలు భాగస్వాములు కావాలని, అపుడే నాణ్యమైన పనులు జరుగుతాయని కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కేటిపిఎస్ పాల్వంచ యూనిట్ ఆధ్వర్యంలో మునిసిపాలిటీ సహకారంతో ప్రజా పాలన, ప్రగతి నివేదిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎస్‌పిఎస్ డైరెక్టర్ జనరల్ స్వాతిలక్రా ఆదేశాలతో సోమవారం స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 41వ, డివిజన్ కార్పో రేటర్ గొర్లె అన్నపూర్ణ ఆధ్వర్యంలో రాతిచెరువు కట్టపై చెత్తా చెదారాన్ని, పిచ్చి మొక్కలను నరికి శుభ్రం చేశారు. కట్ట కింద పేరుకుపోయిన బుర దను తొలగించారు. మేయర్, డిప్యూటి మేయర్, కార్పోరేటర్, ఎస్‌పిఎఫ్ అధికారులు స్వయంగా చెత్తను, బురదను ఎత్తి మునిసిపల్ ట్రాక్టర్‌లో వేశారు. అనంతరం గొర్లె నరేష్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సభలో మేయర్ గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి నివేదికలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలు పునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. అపుడే ప్రజలు కోరుకొన్న అభివృద్ధి సాక్షాత్కరి స్తుందని తెలిపారు. డివిజన్ సమస్యలను ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశి వరావు సహకారంతో స్థానిక కార్పోరేటర్‌తో కలిసి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాల్వంచలో గత 30 సంవత్సరాలుగా ఎన్ని కలు నిర్వహించకపోవటంతో అభివృద్ధి ఎక్కడికక్కడే నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మనమంతా చేయిచేయి కలిపి, ఒక్కటిగా అభివృద్ధి ప్రధాత కూనంనేని నేతృత్వంలో కార్పోరేషన్‌ను అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా నిలబెడదామని కోరారు. రాబోయే రోజుల్లో ఎస్‌పిఎస్ కేటిపిఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వ హించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్‌పిఎఫ్ అడిషనల్ కమాం డెంట్ పి. కోటేశ్వరరావు, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్. చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ స్వాతిలక్రా ఆదేశాల మేరకు స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమం నిర్వహం చామని తెలిపారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాలలో కూడా పరిశు భ్రంగా ఉంచాలని కోరారు.

### - మున్సిపల్ అధికారులపై మేయర్ ఆగ్రహం...

సుమారు వంద మంది ఎస్‌పిఎఫ్ సిబ్బంది, ప్రజలతో పెద్ద ఎత్తున జరు గుతున్న ప్రజాపాలన కార్యక్రమానికి మునిపల్ అధికారులు గైర్హాజర్ కావటంతో మేయర్ గణేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్ల క్ష్యాన్ని నిలదీశారు. జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై మీరెందు కింత చులకనగా చూస్తారంటూ మండిపడ్డారు. ఎందుకు రాలేదంటూ ప్రశ్నించారు. అనంతరం మరోసారి పునరావృతం అయితే ప్రజల ఆగ్ర హానికి గురికాక తప్పదంటూ మునిసిపల్ ఏఈతో అన్నారు.ఈ కార్యక్ర మంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, ఎస్‌పిఎస్ ఇన్స్పె క్టర్ కిరణ్, ఎస్ఐలు జి. వెంగళరావు, నాగరాజు, సతీష్, శ్రీనివాసరెడ్డి, ప్రవీన్, వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు, నాయకులు లాల్‌పాషా, ప్రసాద్, డివిజన్ నాయకులు ఎస్‌పిఎఫ్ సిబ్బంది, మునిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రైతుల అభివృద్ధే గ్రామీణ ఆర్థిక బలానికి పునాది

### -బూర్గంపాడు రైతు వేదికలో శిక్షణ విజయవంతం



ప్రజాపక్షం/బూర్గంపాడు: మహిళా రైతుల అభివృద్ధే గ్రామీణ ఆర్థిక బలానికి పునాది అని మండల వ్యవసాయ అధికారి ఆర్ శంకర్ అన్నారు. మంగళవారం బూర్గంపాడు మండలంలోని రైతు వేదికలో మహిళా రైతుల కోసం నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం విజయ వంతంగా జరిగింది. మండలంలోని అనేక గ్రామాల నుండి మహిళా రైతులు భారీ సంఖ్యలో హాజరై శిక్షణను ఆసక్తిగా స్వీకరించారు. ఈసం దర్భంగా మండల వ్యవసాయ అధికారి ఆర్ శంకర్ మాట్లాడుతూ మహిళా రైతులు వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలి పారు. కుటుంబ ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో మహిళల భాగ స్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పంటల సాగులో సరైన ప్రణాళిక, ఖర్చుల నియంత్రణ, ఆధునిక పద్ధతుల అనుసరణ ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. మహిళా రైతులు సాంప్రదాయ పద్ధతులకు పరిమితం కాకుండా, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు, సమ తుల్య ఎరువుల వినియోగం, నీటి సద్వినియోగం, సమయానుకూల పంట సంరక్షణ చర్యలు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని తెలి పారు. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ, పశుపోషణ రంగాలలో మహిళలు ముందుకు రావాలని ప్రోత్సహించారు. ఈ రంగాలు అదనపు ఆదాయ వనరులుగా నిలుస్తా యని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే అవకాశాలు ఉన్నా యని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికా రులు పవన్, నాగ వైష్ణవి, శృతి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ డిఏలను విడుదల చేయాలి



ప్రజాపక్షం/చంద్రుగొండ: విశ్రాంతి ఉద్యోగు లకు పెండింగ్‌లో ఉన్న డిఏలను వెంటనే విడు దల చేయాలని చంద్రుగొండ, జూలూరు పాడు, అన్నపురెడ్డిపల్లి మండలాల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కాళ్లూరు సుధా కర్‌రావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల కోసం శాశ్వత భవనం నిర్మించేందుకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. అలాగే రూ 398 స్కేల్‌లో పని చేసిన ప్రతి ఉద్యోగికి నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, విశ్రాంత ఉద్యోగులందరికీ ఉచిత వైద్యం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో సంఘం నాయ కులు, సభ్యులు పాల్గొన్నారు.

## క్రీడల్లో ప్రతిభకు బాటలు

### - 20న బూర్గంపాడులో 4వ తరగతి ప్రవేశాల ఎంపికలు



ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాల కోసం బూర్గంపాడు మండల స్థాయి ఎంపికలను ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి యెదు సింహారాజు తెలిపారు. మంగళవారం మండల విద్యావనరుల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ఆసక్తి మరియు ప్రతిభ కలిగిన చిన్నారులకు ఇది ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఈ ఎంపికలు బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలురు క్రీడా మైదానంలో ఉదయం 8:30గంటలకు ప్రారంభం కానున్నాయి. హకింపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఈ ఎంపికలు జరుగుతాయని, ఇప్పటికే టీజీఎస్ఎస్. తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులతో పాటు, ఇంకా నమోదు చేయని వారు కూడా వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని హాజరు కావాలని సూచించారు. అర్హత విషయానికి వస్తే 01సెప్టెంబర్ 2017 నుండి 31 ఆగస్టు 2018 మధ్య జన్మించిన వారు, ప్రస్తుతం 3వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ ఎంపికలకు అర్హులన్నారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా విద్యార్థుల శారీరక ధృఢత్వం, క్రీడా నైపుణ్యాలను పరిశీలించి ఉత్తములను ఎంపిక చేయనున్నారు. ఈ ఎంపికలను వ్యాయామ ఉపాధ్యాయులు బి కృష్ణ, సాగర్, డి పూర్ణ పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తప్పని సరిగా 3వ తరగతి స్టడీ సర్టిఫికేట్, జనన ధృవ పత్రం, కుల ధృవ పత్రం, 6 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరు కావాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 3032324982నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. క్రీడల్లో ముందుకు రావాలనుకునే గ్రామీణ విద్యార్థులకులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## జామే మస్జిద్‌కు ఏసీ రిఫ్రిజిరేటర్ విరాళం



ప్రజాపక్షం/కారేపల్లి : కారేపల్లి జామే మస్జి ద్‌లో దివంగత రైల్వే ఉద్యోగి షేక్ సర్దార్ జ్ఞాప కార్థం ఆయన కుటుంబ సభ్యులు సేవా కార్య క్రమం నిర్వహించారు. సుమారు రూ 60 వేల విలువ గల ఏసీ రిఫ్రిజిరేటర్‌ను మస్జిద్‌కు ఆయన కుమారులు షేక్ సద్దాం, ఆజం అంద జేశారు. ఈసందర్భంగా మస్జిద్ అధ్యక్షులు షేక్ మునీరుద్దీన్ పటేల్ మాట్లాడుతూ సర్దార్ కుటుంబం చేసిన ఈ విరాళం మస్జిద్‌కు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సేవా భావంతో సమాజానికి తోడ్పడటం ఆదర్శనీ యమని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు షేక్ షఫీ, షేక్ అబ్దుల్ మతీన్, యాకూబ్ పాషా, షేక్ జహీర్, షేక్ జావీద్, మొహమ్మద్ రెహమాన్(ఫిరోజ్), షేక్ రియాజ్, షేక్ జాఫర్, మహబూబ్ పాషా, షేక్ యాకూబ్, ఇస్మాయిల్ అతీక్, పాల్గొన్నారు.

## మార్చి 25 వరకు రైతు భరోసా దరఖాస్తులకు గడువు



ప్రజాపక్షం/ములకలపల్లి: రైతు భరోసా యాసంగి 2025, 26 కోసం అర్హులైన రైతులు మార్చి 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి అరుణ్ కుమార్ తెలిపారు. 28 ఫిబ్రవరి 2026 వరకు కొత్త పట్టాదార్ పాస్ బుక్ పొందిన వారు, ఇంకా బ్యాంకు వివరాలు నమోదు చేయని రైతులు తప్పని సరిగా దరఖాస్తు చేయాలన్నారు. ఇప్పటికే నగదు జమ అవుతున్న వారికి దరఖాస్తు అవసరం లేదని, బ్యాంకు వివరాలు మార్చుకోవాలనుకునే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టాదార్ పాస్ బుక్, బ్యాంకు పాస్ బుక్ కాపీ, మొబైల్ నంబర్‌తో సమీప రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.

## మహిళా సంఘాలు బకాయిలు చెల్లించాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: మహిళా సంఘా లు బకాయిలు చెల్లించాలని అదనపు కలెక్టర్( లోకల్ బాడీస్) డీఆర్‌డీఓ విద్యా చందనా అన్నారు. మంగళవారం జగన్నాధపురంలో గ్రామ పంచాయితీలో 28 స్వయం సహాయక సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సంఘాలు తీసుకున్న బ్యాంకు రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తే వడ్డీ లేని రుణాలు పొందే అవకాశాలు ఉంటాయని తెలిపారు. సభ్యురాలు అప్పు తీసుకుని సహజ మరణం చెందితే రూ 2లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ 10లక్షల భీమా సౌకర్యం ఉందని వివరించారు. జీవనోపాధి కోసం పీఎంఎఫ్‌ఎంఈ, పీఎంఈజీపీ పథకాల ద్వారా 35శాతం సబ్సిడీతో రుణాలు పొంద వచ్చని తెలిపారు. అయితే గ్రామంలో 20 సంఘాలు నెలవారీ చెల్లింపులు చేయకుండా క్రానిక్‌గా మారడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యుల వారీగా వివరాలు తెలుసుకుని, వారం రోజుల్లో బకాయిలలో కనీసం సగం మొత్తాన్ని తప్పని సరిగా చెల్లించాలని ఆదేశిం చారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుని రికవరీ చేపడతామని హెచ్చరించారు. ఈకా ర్యక్రమంలో డీపీఎం సమ్మక్క, ఏపీఎం రామ్‌కుమార్, సీసీలు, స్త్రీ నిధి ఏఎం, వీవోఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ముగిసిన జిల్లా స్థాయి ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్



ప్రజాపక్షం/మణుగూరుః గత ఐదు రోజులుగా హెవీ వాటర్ ప్లాంట్, మణుగూరు నందు జిల్లా స్థాయి ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంటు నిర్వహిం చగా దీనిలో సింగరేణి కొత్త గూడెం, కేటీపీఎస్ వి అండ్ విఐ స్టేజ్, కేటీపీఎస్ విఐఐ స్టేజ్, ఐ సి సారపాక, హెచ్ డబ్ల్యు పీ ఎం మణుగూరు, టీజీ ట్రాన్స్కో, సింగరేణి మణుగూరు, బిటిపిఎస్ మణుగూరు జట్లు పాల్గొనగా సింగరేణి మణుగూరు, బి.టి.పి.ఎస్ మణుగూరు ఫైనల్ కు చేరుకుని హోరాహోరీగా తలపడి బి.టి.పి.ఎస్ మణుగూరు జట్టు ద్వితీయ స్థానాన్ని పొందింది. బహు మతి ప్రధానోత్సవం కార్యక్రమంలో బి.టిపి.ఎస్ చీఫ్ ఇంజనీర్ బి. బిచ్చన్న సార్ ముఖ్యఅ తిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంలో బీటీపీయస్ జట్టు సభ్యులను అభినందించి, సీఈ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న ఇన్ని పెద్ద సంస్థల మధ్య అద్భుతమైన క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహించినందుకు హెచ్‌డబ్ల్యూపిఎం మణుగూరు యాజమాన్యాన్ని అభినందిస్తూ అన్ని సంస్థల మధ్య మంచి అవినాభావ సంబంధాన్ని, స్నేహాన్ని పెంపొందించుకొనుటకు ఇలాంటి టోర్నమెంట్లు దోహదపడతాయని తెలిపారు. మునుముందు కూడా జిల్లా ఇండస్ట్రి యల్ క్రీడలను క్రమం తప్పకుండా నిర్వహించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడా కార్యదర్శి కల్తి నరసింహారావు, జట్టు సభ్యులు గోపాలకృష్ణ, అశోక్ రెడ్డి, కార్తీక్, హేమ మూర్తి, వినోద్, విశృత్, రమేష్, అనిల్ కుమార్, ప్రేమ్ ప్రకాష్, రవికుమార్, తిరు పతి, ప్రవీణ్, సంపత్, భరత్, నవీన్, దుర్గాప్రసాద్ మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఏసిపిని ఆశ్రయించిన భూదాన్ బాధితులు



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : వెలుగుమట్ల భూదాన్ కమిటి ముఠా సభ్యుల చేతిలో ఆర్థికంగా మోసపోయిన మరికొందరు బాధితులు మంగళవారం ఖమ్మం టౌన్ ఏసిపి రమణమూర్తిని ఆశ్రయించారు. ఇంటి స్థలాలు ఇప్పిస్తామని యుసిసిఆర్ (ఎంఎల్), వినోబాబు వెల్ఫేర్ పేరుతో బాధితుల నుంచి లక్ష రూపాయల నుంచి మూడులక్షల రూపాయల వరకూ వసూలు చేశారని ఏసిపికి ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చిన తొమ్మిది మంది బాధితులు తమ వద్ద ఉన్న రశీదులను ఆయనకు చూపించారు. వాటిని పరిశీలించిన ఆయన రశీద్‌లపై పి.అరవింద్ పేరున ప్రింట్ చేసి ఉండగా పాలబోయిన ముత్తయ్య అనే నిందితుడు దురుద్దేశపూర్వకంగా వసూళ్లకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులపై చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఇప్పటికే ముఠా సభ్యులను పట్టుకునేందుకు ముగ్గురు సిఐలతో బృందం దర్యాప్తు చేస్తోందని కొందరు నిందితులను ఇప్పటికే అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అక్రమంగా వసూలు చేసిన నగదుతో వారు కొనుగోలు చేసిన ఆస్తులను గుర్తించామని, బ్యాంక్ ఎకౌంట్లను సైతం ఫ్రీజ్ చేయటం జరిగిందని ఏసిపి బాధితులకు తెలిపారు. ఏసిపిని కలిసిన తొమ్మిది మందితో పాటు చిర్రా చంద్రకళ, చిర్రా గీతాంజలి, నకుతాలి పుల్లమ్మ, కందగట్ల పాపయ్య ల నుంచి ఒక్కొక్కరి నుంచి మూడున్నర లక్షల చొప్పున పద్నాలు లక్షలరూపాయలు నిందితులు వసూలు చేసి మోసం చేసినట్లు తెలిపారు. ఫ్లెక్సీలు, ఫోటోగ్రాఫ్‌లను వారి కార్యక్రమాలకు ఉపయోగించుకున్నారని వారి మాటలు నమ్మి నష్టపోయామని విచారించి తమకు న్యాయం చేయాలని బాధితులు ఏసిపి ఫిర్యాదు చేశారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

## మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ





ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ మీటర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మంగళవారం వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి కి విద్యుత్‌శాఖ డిఈ రమేష్‌తో కలిసి అందజేశారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి కౌన్సిలర్ వరలక్ష్మి కృషి చేస్తున్నారు. ఇటీవల ప్రజాపాలన ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా వార్డులో పర్యటించిన జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ దృష్టికి కౌన్సిలర్ వరలక్ష్మి అంగన్‌వాడీ కేంద్ర సమస్యలను వివరించారు. అందులో భాగంగా ఈ రోజు అధికారులు అంగన్‌వాడీ కేంద్రానికి కావాల్సిన విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లకు సంబంధించిన వస్తువులను తీసుకురావడం జరిగిందని ఆమె అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పావురంలో శుభ్రత అవసరమని పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చైర్‌పర్సన్ చంద్రకళ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, వుంద్రు శ్యామ్‌బాబు, మాజీ కౌన్సిలర్ గుగులోతు లక్ష్మీ బాయి, పొదిలి హరినాథ్, తేజావత్ నాగేశ్వరరావు, గుగులోత్ విజయ్, తాడి రాజు, పృధ్వి, లైన్ ఇన్స్‌పెక్టర్ పాల్గొన్నారు.

# ఆధునిక పద్ధతిలో పత్తి సాగుపై అవగాహన




ప్రజాపక్షం/వైరా: వైరాలో ఘనంగా కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా రైతు సదస్సును ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్శిటీ విస్తరణ అధికారి డాక్టర్ ఎం.యాదాద్రి, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమంత్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కిసాన్ మేళా రైతు సదస్సులో వారు మాట్లాడుతూ అధిక సాంద్రత పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు అపరాలు, కంది, పెసర, పత్తి, మొక్కజొన్న పంటలు, పామాయిల్ సాగుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. శాస్త్రవేత్తల సలహాలతో పంటలు సాగు చేయాలని అన్నారు. వాతావరణానికి అనుకూలంగా సాగు చేసే పంటలు అధిక దిగుబడులు నిస్తుందని తెలిపారు. ఉద్యానవనశాఖలో కల వివిధ ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. కిసాన్ మేళా రైతు సందర్భంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన యాదాద్రి ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో పలు కంపెనీలకు చెందిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి పుల్లయ్య, ప్రోగ్రాం నిర్వాహకులు డాక్టర్ దేవి, శాస్త్రవేత్తలు ప్రశాంతి, పనిశ్రీ, చైతన్య, పావని,యాదగిరి, మధుసూదన్, కరుణశ్రీ, కెవికె శాస్త్రవేత్తలు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# తాటిపూడి సమగ్ర అభివృద్ధే లక్ష్యం

**-ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో నిధులు**
**-రోడ్లు, తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**
**-ప్రజాపక్షంతో సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు**



ప్రజాపక్షం/వైరా: తాటిపూడి గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు తెలిపారు. సోమవారం సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు ప్రజాపక్షంతో మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులు, భవిష్యత్తు ప్రణాళికలను ఆమె వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సహకారంతో రూ.10 లక్షలు సిసి రోడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామంలో మరికొన్ని సిసి రోడ్ల నిర్మాణాలు డ్రైనేజిల నిర్మాణానికి నిధులు కావాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను అడగడం జరిగింది. త్వరలోనే నిధులు మంజూరు చేయనున్నారు. గ్రామంలో ఉన్న పల్లె దవాఖాన హాస్పిటల్ భవనం ప్రమాదకరంగా ఉంది. నూతన భవనం ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. హాస్పిటల్ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. గ్రామంలోని పశువుల హాస్పిటల్ భవనంలో మౌలిక వసతుల ఏర్పాటు కోసం ప్రతిపాదన పంపిస్తున్నాం. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరిగింది. గ్రామంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా ఉండేవిధంగా వర్కర్స్‌ను పనులు చేసేవిధంగా పలు సూచనలు చేయడం జరిగింది. డ్రైనేజీలు శుభ్రపరచడం, నీరు నిల్వ లేకుండా చూడడం, రోడ్ల ప్రక్కన పిచ్చి మొక్కలను తొలగించడం నిత్యం పనులు జరిగే విధంగా ప్రణాళికను రూపొందిస్తున్నాం. పారిశుద్ధ్య సమస్య లేకుండా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. గ్రామ ప్రజల ఆరోగ్యం మా ధ్యేయం అని తెలిపారు. గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో వోల్టేజ్ సమస్య ఉందని దానికి సంబంధించి విద్యుత్ అధికారులు దృష్టికి సమస్యలు తీసుకెళ్లాం. సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని తెలిపారు. లోవోల్టేజ్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అధికారులను ఆదేశించారని అన్నారు. గ్రామంలో పలు అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే దృష్టికి ప్రతిపాదనలు తీసుకెళ్లడంతో త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. త్రాగునీటి సమస్య దృష్టిలో పెట్టుకొని గ్రామంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ పునరుద్ధరణకు ప్రతిపాదనను పంపించడం జరిగింది. త్వరలోనే దానికి సంబంధించిన వాటర్ సరఫరా చేయడం జరుగుతుందని, ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చేస్తామని అన్నారు. మా మీద నమ్మకంతో మమ్మల్ని నమ్మి ఓటు వేసిన ప్రజల ఆశలను వమ్ము చేయకుండా నిరంతరం గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు తెలిపారు.

# 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : స్వయం ఉపాధి పథకాలకు నిరుద్యోగ ఎస్సీ యువతీ, యువకులు మార్చి 24 లోపు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సీ కార్పోరేషన్ ఈడి నవీన్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను మార్చి 25లోగా సంబంధిత ఆన్‌లైన్ దరఖాస్తులకు ధృవపత్రాలు జతచేసి హార్డ్ కాపీలను కలెక్టరేట్‌లోని ఈడి ఎస్సి కార్పొరేషన్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. నిరుద్యోగ ఎస్సి యువతీ, యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమోదించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నదన్నారు. https://tgodmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ ఎస్సి యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని నవీన్‌బాబు తెలిపారు.

# రైతు మహోత్సవానికి రైతులకు ఆహ్వానం

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఈనెల 20 నుంచి 22 వరకు నర్మెట్టలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే రైతు మహోత్సవానికి రైతు సోదరీ సోదరిమణులు హాజరు కావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ రైతు మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్థక రంగాలకు సంబంధించిన ప్రత్యేక స్టాల్స్, బ్యాంకులు, ఎఫ్‌పివోలు, స్టార్టప్‌లు, ప్రైవేటు కంపెనీల ప్రదర్శనలు, అధికారులు, శాస్త్రవేత్తలతో రైతులకు ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 22న సాయంత్రం నాలుగు గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభంతో పాటు రైతు భరోసా నిధుల విడుదల ఉంటుందని తెలిపారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, ఆదర్శ రైతులు, రైతు బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# సత్యనారాయణ మృతికి నామ నివాళి



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఇఒ మోరంపూడి సత్యనారాయణ మృతి పట్ల బిఆర్ఎస్ మాజీ లోక్‌సభాపక్షనేత, ఖమ్మం మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన స్వగృహానికి చేరుకుని సత్యనారాయణ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా బిఆర్ఎస్ నాయకులు తాళ్లూరు జీవన్‌కుమార్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, మాజీ ఎంపిపి దొడ్డ శ్రీను, దుగ్గిదేవర అజయ్, నాయకులు నాయుడు శ్రీనివాసరావు, కనకయ్య, శెట్టిపల్లి లక్ష్మణరావు, వెంకటరెడ్డి, వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మోరంపూడికి నివాళులర్పించిన నున్నా



తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు మోరంపూడి సత్యనారాయణ మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ మంగళవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి మల్లెంపాటి వీరభద్రం, పారుపల్లి ఝాన్సీ, పారుపల్లి దేవేందర్, డివిజన్ కార్యదర్శి సేలం సత్యనారాయణరెడ్డి, తాతా భాస్కర్‌రావు, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, మాచర్ల గోపాల్, కళ్యాణపు కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

# రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి



ప్రజాపక్షం/వైరా: వైరా మండల పరిధిలో 395 కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు రావడం జరిగింది. రైతు భరోసా కొరకు దరఖాస్తు చేసుకోవాలి. ఫిబ్రవరి28 నాటికి పాస్‌బుక్ వచ్చిన వారు ఈ పథకానికి అర్హులు. అర్హులైన రైతులు రైతు భరోసా అప్లికేషన్ ఫారం, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ అన్ని ఆధారాలు పెట్టి దరఖాస్తు పూరి తచేసి వ్యవసాయ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి మార్చి25వ తారీఖు వరకు దరఖాస్తులు సమర్పించాలని వైరా మంల వ్యవసాయ అధికారి తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయంపై మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ఉన్న సోమవరం రైతువేదిక నందు మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి దాసరి పుల్లయ్య, జిల్లా డిహెచ్‌ఎస్‌వో మధుసూదన్, వైరా వ్యవసాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, టెక్నికల్ అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రకృతి వ్యవసాయంపై అన్నదాతలకు పలు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయం వైరా మండలంలో తాటిపూడి, ఖానాపురం, నారపనేనిపల్లి గ్రామాల్లో చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఫార్మర్ కిట్స్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు మేదా రాజేష్, వెంపటి కీర్తి, వాసవంతి, వెంకటనరసయ్య, నారపునేనిపల్లి సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌రెడ్డి, తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు, ఖానాపురం సర్పంచ్ బాలాజీ, మునిమడుగు సర్పంచ్ తడికమళ్ల నాగార్జున, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# సింగరేణిలో నల్లబ్యాడ్జీలతో నిరసన



### సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం : మిర్యాల రంగయ్య

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** సింగరేణిలో కార్మిక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో కార్పొరేట్ ఏరియాలోని అన్ని డిపార్ట్మెంట్లలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా యాజమాన్యం కాలయాపన చేస్తోందన్నారు. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఆందోళన కార్యక్రమాలకు పిలుపిచ్చినట్లు చెప్పారు. కొన్ని సమస్యలనువ యాజమాన్యం స్ట్రక్చర్ సమావేశాల్లో అంగీకరించినప్పటికీ ఇంత వరకు వాటి అమలుకు సర్క్యులర్ జారీ చేయకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రధానంగా మారుపేర్లు, విజిలెన్స్ కేసుల సమస్య, సొంత ఇంటి పథకం, పెర్క్స్ పై ఇన్‌కం టాక్స్ సమస్య, డిస్మిస్ కార్మికులకు అవకాశం కల్పించాలని కోరారు. యాజమాన్యం సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. భవిష్యత్ కార్యచరణపై వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈనెల 18 నుండి 30 వరకు గోలేటి నుండి కొత్తగూడెం వరకు బస్ జాతా ప్రారంభం అవుతుందని, 30న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను, ఏప్రిల్‌లో జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జరగబోయే ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులు అంధిక సంఖ్యలో పాల్గొని సంస్థ మనుగడ కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి రమణ మూర్తి, ఉపాధ్యక్షులు క్రిష్టాఫర్ సహాయ కార్యదర్శి రాము, పిట్ కార్యదర్శులు నరేష్, సుధీర్, అనంత లక్ష్మీ, సూర్యప్రభ, జీవి రమేష్, శ్యాం, శ్రీనివాస్, నాయకులు ప్రశాంత్, నాగయ్య, సరిత, ప్రవీణ్, వేమనా చారి, లక్ష్మ య్య తదితరులు పాల్గొన్నారు.

# తోగ్గూడెం అక్రమ మైనింగ్‌పై విచారణ జరపాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి తోగ్గూడెంలో నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి దోషులనుపై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ తోగ్గూడెం గ్రామంలో అనేక సంవత్సరాలుగా సుమారు 10 కంకర క్వారీలు, వాటికి అనుబంధంగా ఏడు క్రషింగ్ మిల్లులు నడుస్తున్నాయని అన్నారు. అమాయక గిరిజనులను అడ్డం పెట్టుకొని వారి వారి పేర్లతో ప్రభుత్వం నుండి అనుమతులు పొందిన కొందరు దళారులు భారీ ఎత్తున అక్రమ మైనింగ్ చేపడుతున్నారని ఆరోపించారు. అక్రమ దందాపై గత నాలుగు సంవత్సరాలుగా బిజెపి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు చేస్తూ నిరంతరం పోరాటం చేస్తున్నదని చెప్పారు. ఈ క్రమంలో గనులశాఖ నిర్వహించిన శాటిలైట్ సర్వేలో సుమారు 50 లక్షల క్యూబిక్ మీటర్ల కు పైగా అక్రమంగా తవ్వకాలు చేశారని అధికారిక రికార్డులు వెల్లడిస్తున్నాయన్నారు. దీనితో మైన్స్, జియాలజీ శాఖ వారి ఆధ్వర్యంలో పలువురి క్వారీ లీజ్ హోల్డర్‌లపై సుమారు 300 కోట్లకు పైగా డిమాండ్ నోటీసులు జారీ చేసిందన్నారు. జరిమానాను చెల్లించకుండా కందరు క్వారీ యాజమానులు రోజు వారీగా అక్రమంగా త్వ్వకాలను చేస్తూ క్రషింగ్ మిల్లులను కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఈ అక్రమ పర్వంతో ప్రభుత్వానికి కోట్ల ఆదాయానికి గండి పడుతున్నదని పేర్కొన్నారు. వీరి వల్ల ప్రభుత్వానికి నష్టంతో పాటుగా పర్యావరణానికి తీవ్ర ముప్పువాటిల్లుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. విధించిన జరిమానా300 కోట్లు రికవరి చేసి గత కొన్ని సంవత్సరాలు అక్రమ మైనింగ్ చేస్తున్న వారిపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీలను మూసివేసిన ప్రభుత్వ నిభంధనల మేరకు ఆ ప్రాంత గిరిజనులకు అనుమతులను జారీ చేసి ప్రజల అవసరాలను తీర్చాలని కోరారు. ఈ వ్యవహారంపై హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం(పిల్) దాఖలు చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి నూముల రమేష్, గొడుగు శ్రీధర్, విద్యాసాగర్, కాల్వ ప్రసాద్, మాదారపు లక్ష్మణ్, లింగగిరి వెంకటరామయ్య, భూక్యా మోహన్, భూక్యా ఆశ, కోటేశ్వరరావు, పవన్, కొత్తపల్లి విజయ్, బానోత్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.




# సహజ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలి



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** సహజ సిద్ధమైన వ్యవసాయాన్ని చేసేందుకు రైతులు ముందుకు రావాలని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు అన్నారు. మంగళవారం దుమ్ముగూడెం మండల పరిధిలోని పర్ణశాల రైతు వేదికలో సహజ వ్యవసాయంపై ఒక్కరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సహజ సిద్ధమైన వ్యవసాయ పద్ధతులు, ప్రయోజనాలు, ఖర్చు, తగ్గింపు, నేల, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. రైతులు స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయడం ద్వారా లాభాలు గడించే అవకాశం ఉందన్నారు. అనంతరం రైతులకు కిట్లు పంపిణీ చేశారు.

# సమన్వయంతో నవమి పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** రెవెన్యూ, పోలీస్, దేవస్థానం, ఇతర శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి వివిఐపి,విఐపి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నవమి పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా పనుల పురోగతిపై ఎస్‌పి రోహిత్, సబ్ కలెక్టర్ మినాల్ శ్రేష్ఠ, ఐటిడిఏ పిఓ రాహుల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఎస్‌పి విక్రాంత్ సింగ్ కుమార్, దేవస్థానం ఇఓ దామోదర్ రావుతో కలిసి శాఖల వారీగా సమీక్షించారు. జరిగే శ్రీరామన నవమి, పట్టాభిషేకం మహోత్సవం జిల్లా ప్రతిష్టకు భంగం వాటిల్లకుండా చూడాలన్నారు. వచ్చే ముఖ్యులు, భక్తులకు మెచ్చేలా ఏర్పాట్లు ఉండాలని, ముందస్తు ప్రణాళికతో సమగ్రచర్యలు తీసుకోవాలని, అధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా చూడాలని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి లోటుపాట్లు లేకుండా సకల సౌకర్యాలు కల్పించాలన్నారు. అన్నిశాఖలు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలని ఆదేశించారు. అనంతరం ఎస్‌పి రోహిత్ మాట్లాడుతూ భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం మిథిలా స్టేడియం వద్ద జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్నిశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ జమలాపురం వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 19 నుండి 28వ తేదీ వరకు జరిగే శ్రీ వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను హైద్రాబాద్ దేవాదాయ ధర్మదాయశాఖ కమీషనర్ ఎం.హన్మంతరావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు శ్రీగోవింద హరికి మంగళవారం అందచేసి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల విజయదేవశర్మ, ఆలయ ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసరశర్మ, వి.వంశీ తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాచలం/బూర్గంపాడు:** భద్రాచలం పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఐటీసీ గెస్ట్ హైస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ అంకిత్ మొక్కను అందజేసి న్యాయమూర్తికి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పురోగతిపై సంక్షిప్తంగా వివరించారు. జిల్లా పరిపాలనలో చేపడుతున్న కార్యక్రమాలపై న్యాయమూర్తి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

# మొక్కజొన్న పంటపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల పరిధిలోని మర్కోడు గ్రామ పరిధిలో గల జిన్నెలగూడెం గ్రామంలో కొర్స మల్లయ్య అనే రైతు జీనేక్స్ సీడ్స్ వారి టాపర్ మొక్కజొన్న పంటను మంగళవారం రైతు ప్రదక్షణ క్షేత్రం నిర్వహించారు. ఈ టాపర్ మొక్క జొన్న కంకులు పొడవుగా లావుగా బలమైన గింజలతో ఉన్నాయని దీని వల్ల అధిక దిగుబడి వస్తుందని అందరు రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. కష్టపడి సాగు చేసిన మొక్కజొన్న పంటకు అధిక దిగుబడి వచ్చినప్పుడే రైతులకు అసలైన ఆనందం లభిస్తుందని కంపెనీ యజమాన్యం శ్రీపాల్‌రెడ్డి ఈసందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సుమారుగా 500 మమంది రైతులు పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో గత మూడు నాలుగు సంవత్సరాలుగా ఎంతో మంది రైతులు టాపర్ మొక్కజొన్న పంట వేసి అధిక దిగుబడి వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. టాపర్ రకం మొక్కజొన్న పంట పండించిన రైతు మల్లయ్య దంపతులను స్థానిక గ్రామీణ డీలర్ వెలిశాల కార్తీక్, అనుమోల వెంకటేశ్వరరావు శాలువా కప్పి సత్కరించారు. ఈకార్యక్రమంలో ప్రముఖ వ్యాపారస్తులు వెలిశాల కార్తీక్, అనుమోల వెంకటేశ్వరరావు, మర్కోడు గ్రామ పంచాయితీ సర్పంచ్ సుతారి రమాదేవి, పడిగ సమ్మయ్య, కంపెనీ సిబ్బంది బానోత్ జితేందర్, రాయుడు, రఘు, రాకేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. పాలేరు క్లస్టర్‌కు చెందిన రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని శిక్షణను పొందారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి శరత్ బాబు, ఆలేరు డివిజన్ ఉద్యాన అధికారి అపర్ణ, కూసుమంచి డివిజన్ టెక్నికల్ ఏవో అరుణ రైతులకు మార్గదర్శనం చేశారు. ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, దశపర్ణి కషాయాల తయారీ విధానాలను వివరంగా తెలియజేశారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతుల ద్వారా దిగుబడిని పెంచుకోవచ్చని అధికారులు సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గి, మట్టిసారం పెరిగి, ఆరోగ్యకరమైన పంటలు పొందవచ్చని తెలిపారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జానీ బాబు, ప్రియాంకతో పాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నవోదయ ఫలితాల్లో శ్రీ సాయి వివేక భారతి విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/కామేపల్లి:** మండల పరిధిలోని కొత్త లింగాల గ్రామంలో ప్రైవేట్ పాఠశాల శ్రీ సాయి వివేక భారతి పాఠశాల విద్యార్థులు నవోదయ పాఠశాల నందు ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు. మండల పరిధిలోని గోవింద్రాల బంజర గ్రామానికి చెందిన లకావత్ గణేష్ రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు. మండల పరిధిలోని కొత్త లింగాల గ్రామానికి చెందిన పాలె జస్విక శ్రయ 68వ ర్యాంకు సాధించారు. ఈసందర్భంగా పాఠశాల నిర్వాహకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాల ఇద్దరు విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచి సీటు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దిన పాఠశాల ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏదీ లేదని పాఠశాల విద్యార్థులు నిరూపించారని పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఐటిడిఏ పిఓ



**ప్రజాపక్షం/పాల్వంచ :** భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం సందర్శించారు.ఈ సంధర్భంగా మోకాలి కీలు మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసిన వైద్యులు సైలేష్, రాంప్రసాద్‌లను అభినందించారు. ఈ సంధర్భంగా పేషెంట్ కవితను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. ఆసుపత్రిలోని ఓపి, ఫార్మసి, బ్లడ్ స్టోర్ సెంటర్, మెడికల్ వార్డ్, పిఓడబ్ల్యూ వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులను, సిబ్బందిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి మోకాలి కీలు మార్పిడి చికిత్స హెల్త్ సెంటర్‌లో చేయటం వైద్యుల అంకిత భావానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ సోమరాజుదొర తదితరులు పాల్గొన్నారు.

# లోపాలు సరిదిద్దుకోండి.. లేదంటే బ్లాక్ లిస్టులో పెడతాం



## - కలెక్టర్ ఆగ్రహం

**ప్రజాపక్షం/గుండాల :** రెండ్రోల్లో పాఠశాలలో ఉన్న అన్ని లోపాలు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ సరిదిద్దు కోవాలని, లేదంటే ఏజెన్సీ గుర్తింపు రద్దు చేసి బ్లాక్ లిస్టులో పెడతామని జిల్లా కలెక్టర్ అంకిత్ తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం గుండాల మండల పరిధిలోని ముత్తారం గ్రామంలోని ఏకలవ్య పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఏజెన్సీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులు, ఆర్ఓ వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, కంప్యూటర్ ల్యాబ్ తదితర సదుపాయాలను సమగ్రంగా పరిశీలించిన ఆయన నేరుగా విద్యార్థుతో ముచ్చటిం భోజన నాణ్యత, పాలు సరఫరా, పరీక్షల నిర్లక్షణపై ఆరా తీశారు. ఇందులో భాగంగా పాఠశాలలో అపరిశుభ్రత తాండవిస్తుండటం, కిచెన్ షెడ్ అపరిశుభ్రత, సిబ్బంది కొరత, కంప్యూటర్ ల్యాబ్ దుమ్ముపేరుకుపోయి ఉండటం, మెనూ ప్రారం ఆహారం అందించక పోవడం వంటి అంశాలను గమనించిన కలెక్టర్ తీవ్ర అగ్రహాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించిన కలెక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో అవుట్ సోర్సింగ్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తీరుమారాలని లేదంటే కఠిన చర్యలు తప్పవన్నారు. ఉదయం వండిన ఆహారాన్ని సాయంత్రం వరకు నిల్వచేయకుండా తాజా భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో 108 అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడి వారు అందిస్తున్న సేవలపై వివరాలు సేకరించారు. ప్రధానంగా వచ్చే కేసులు, అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలిస్తున్న ఆస్పత్రులపై ఆరా తీశారు.మందుల గది, ఇంజక్షన్ రూమ్, స్టోర్ రూమ్, రక్త పరీక్ష గది తదితర విభాగాలను పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిష్టర్ , స్టాక్ రిజిష్టర్ పరిశీలించిన ఆయన డెంగీ కిట్ల లభ్యతపై విచారణ వ్యక్తం చేశారు. అవసరమైన అన్ని రకాల మందులు, కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం నూతన తహశిల్దార్ కార్యాలయ నిర్మాణాన్ని పరిశీలించిన నాణ్యత తనిఖీ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఆర్ఓ ప్లాంట్ రెండేళ్లుగా పనిచేయక పోవడాన్ని పరిశీలించిన ఆయన కొత్తప్లాంట్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం పశువైద్యంపై ఆరా తీసి పశువులకు అందించే వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కలెక్టర వెంట తహశిల్దార్ ఖాసీమ్, మండల ప్రత్యేకాధికారి ఇంతియాజ్ ఖాన్, ఎంపిడిఓ బాలరాజు, నితిన్ సింగ్, డా. సుధీర్, శ్రావణ సంధ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ బోనకల్ :** ప్రస్తుతం సమాజంలో పెరిగిపోతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిడిపిఓ బాలత్రిపుర సుందరి, సీనియర్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం బోనకల్ మండల పరిధిలోని రావినూతల రైతు వేదిక నందు ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు మానవ అక్రమ రవాణాపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద నేరంగా ఉందని, సమాజంలో అన్ని వర్గాల ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉన్న అంగన్వాడీ టీచర్లు అందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా యుక్తవయస్సులో బాలికలు ప్రేమ పెళ్లి, ఫోన్‌మోజులో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, జీవితంపై ఎలాంటి అవగాహనా లేక పారిపోవడం, చివరికి మోసపోయి వ్యభిచార గృహాలకు అమ్మబడుతున్నారని అన్నారు. అక్రమ రవాణాకు, సైబర్ ట్రాఫికింగ్ గురైనప్పుడు భయపడకుండా దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో గాని, టోల్ ఫ్రీ నెంబర్ 100, 1098, 1930లను సంప్రదించాలని వారు సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆడపిల్లల మహిళల రక్షణ కోసం స్థాపించబడిందని, పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 32500 మంది అమ్మాయిలను, చిన్న పిల్లలను కాపాడి పునరావాసం కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు సుజాత, రమాదేవి, ప్రజ్వల సిబ్బంది భూపాల్, బోనకల్ మండలంలోని అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీవారి రథోత్సవం

**ప్రజాపక్షం/పాల్వంచ:** పట్టణ పరిధి శ్రీనివాసకాలనీలోని శ్రీనివాసగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణ పురవీధుల్లో రథోత్సవం అత్యంత వైభవంగా, నేత్రపర్వంగా నిర్వహించారు.కళ్యాణ ఉత్సవ విగ్రహాలను కొండపై నుండి మెట్ల మార్గం ద్వారా పాదాల మండపం వద్దకు తీసుకొచ్చారు.ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్‌శర్మ, అర్చకులు ఫణిరాజాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు.అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించిన అమ్మవార్ల, స్వామివార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా రకరకాల పూలతో అలంకరించిన రథంపైకి ఎక్కించారు. గోవిందా గోవిందానామ స్మరణతో భక్తుల సమక్షంలో ఆలయ ట్రస్టు సభ్యులు జెండా ఊపి రథాన్ని ప్రారంభించారు. ఆలయం నుండి బయలు దేరిన శ్రీవారి రథం దమ్మపేట సెంటర్, అంబేద్కర్ సెంటర్, నటరాజ్ సెంటర్, శాస్త్రిరోడ్, బిసిఎం రోడ్ మీదుగా తిరిగి శ్రీనివాసగిరికి చేరుకొన్నది. రథయాత్రలో బేర లక్ష్మి బృందం ప్రదర్శించిన కోలాటం , కేరళ సాంప్రదాయ సింగారి వాయిద్యం, ప్రత్యేకంగా రూపొందించిన స్వామి వారి రూపాలు, ఏనుగు అంబారీలు, వివిద కళారూపాలు ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు చైర్మన్, కో చైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు, మందడపు ముక్కంటేశ్వరరావు, అద్యక్షులు బిక్కసాని సుధాకర్, ట్రస్టు సభ్యులు వంకధారు నరసింహ కుమార్, కొత్తగూడెం కార్పోరేషన్ డిప్యూటి మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పోరేటర్ చెరుకూరి భాగ్యలక్ష్మి, శ్రీనివాసగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి సేవా ట్రస్ట్ సబ్యులు, భక్త సమాజ మండలి అధ్యక్ష, కార్యదర్శులు ఊకె భద్రయ్య, తాటికొండ శ్రీలత, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్‌ను తరిమికొడదాం

**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్లాస్టిక్ వాడకాన్ని తరిమికొట్టి పర్యావరణాన్ని కాపాడుకొందామని పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ పిలుపునిచ్చారు. మండల పరిధి లక్ష్మిదేవిపల్లిలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్ వాడకం, కలిగే అనర్థాలపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈకో క్లబ్ సమన్వయకర్త డి. రమేష్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత ప్రజారోగ్యానికి ఎంతో ముఖ్యం

## - డిఎంఅండ్ హెచ్ఓ



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని జిల్లా వైద్యాధికారి డా. తుకారం రాథోడ్ అన్నారు. ఆహారభద్రత, పరిశుభ్రత, ప్రమాణాలపై వీధి ఆహార విక్రేతలు, రెస్టారెంట్ యజమానులు, వంట కారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్వంచలోని డిప్యూటీ డిఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ఆహార భద్రత, పరిశుభ్రత పాటించడం ప్రజారోగ్యానికి ఎంతో అవసరం అన్నారు. ఆహార పదార్థాలు శుభ్రంగా చేయడం, వంట చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, శుద్ధమైన తాగునీటిని వినియోగించడం, ఆహార పదార్థాలను సరైన పద్ధతిలో నిల్వ చేయడం, ఆహార తయారీలో పాల్గొనే వారి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీ శరత్, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ, హైజీన్ ట్రైనర్ నందిని తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్‌కిడ్జ్‌లో రంజాన్ వేడుకలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని పాఠశాలలో ముందస్తు వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విద్యార్థులు తమ తోటి మిత్రులకు ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఒకరికొకరు ఖర్జురాలు, పండ్లు, సేమియాలను అందించి తమ ఆత్మీయ అనుబంధాన్ని చాటుతూ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రపంచమంతట మతసామరస్యాన్ని చాటుతూ జరుపుకునే పండుగ రంజాన్ అని తెలిపారు. కఠిన ఉపవాసాలను ఆచరించి చివరి రోజు ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన్ని జరుపుకుంటారని తెలిపారు. ఓర్పు, సహనం, త్యాగనీరతిని రంజాన్ మాసం గుర్తు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చింత నిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వేటగాళ్ళ అరెస్ట్



**ప్రజాపక్షం/పెనుబల్లి:** తల్లాడ రేంజ్ పెనుబల్లి మండలంలోని తాళ్లపెంట బిట్ పరిధిలో మంగళవారం కొందరు వేటగాళ్లు అడవి పందిని వేటాడారన్న సమాచారం అందుకున్నారు. తల్లాడ ఎఫ్ఆర్ఓ ఉమా వెంటనే తన సిబ్బందితో తాళ్లపెంట ఊరి బయట చెరువు వద్ద వేటగాళ్ల స్థావరాన్ని గుర్తించి అడవి పంది మాంసాన్ని కోసి విక్రయిస్తున్న వేటగాళ్లపై మెరుపు దాడి చేశారు. అధికారులను చూసి పారిపోతున్న వేటగాళ్లను వెంబడించగా ఒక వ్యక్తి పట్టుబడ్డాడు. మరి కొందరు వేటగాళ్లు పరారయ్యారు. పట్టుబడ్డ వ్యక్తిని అదుపులోకి తీసుకొని సుమారు 60 కేజీల అడవి పంది మాంసాన్ని పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలంలో ఉన్న రెండు బైకులు, రెండు సెల్ ఫోన్లను కూడా స్వాధీన పరుచుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తిని విచారణ చేపట్టి పరారైన వారి వివరాలను రాబట్టి వారిని కూడా అదుపులోకి తీసుకుంటామని ఆమె తెలిపారు. స్వాధీనం చేసుకున్న అడవి పంది మాసాన్ని పెనుబల్లి తరలించి పంచనామా చేసి మాంసాన్ని తల్లాడకు తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు. తల్లాడ శివారులోని చెరువు వద్ద కరెంటు తీగలు అమర్చి అడవి పందిని వేటాడి ఉంటారని ఎఫ్ ఆర్ ఓ ఉమా అనుమానం వ్యక్తం చేశారు. ఈ దాడిలో తల్లాడ ఎఫ్ ఆర్ వో ఉమా, డివీఆర్వో సురేష్, ఎఫ్ఎస్ఒ కాలు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీనియర్ టిడిపినేత గంజి నారాయణ మృతి




**ప్రజాపక్షం/ మధిర :** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, టిడిపి రాష్ట్ర నాయకులు గంజినారాయణ(99) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు తదితరులు సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధిరలోని తన స్వగృహంలోని ఆయన భౌతికకాయాన్ని మధిర మున్సిపల్ చైర్పర్సన్ సామినేని సుజాత, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామానాధం, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధు, మధిర నియోజవకర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజి నారాయణ తెలుగుదేశం పార్టీకి, ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. గంజి నారాయణ తన జీవితమంతా కార్మికులు, రైతులు, పేద ప్రజల కోసం అంకితభావంతో పనిచేశారని అన్నారు. పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి విలువలను కాపాడుతూ ముందు నడిపించిన నేత గంజినారాయణ అని పేర్కొన్నారు. ఆయన మరణం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చటంలో విఫలమైన కాంగ్రెస్




**ప్రజాపక్షం/ బోనకల్ :** తెలంగాణలో అధికారంలోకి రాక ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలమైందని బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు తాళ్లూరు సురేష్, ప్రధాన కార్యదర్శి జంపాల రవి విమర్శించారు. మంగళవారం మండల తహశీల్దార్ కార్యాలయం నందు బిజెపి ఆధ్వర్యంలో తహశీల్దార్ బాలాజీకి వినతిపత్రాన్ని అందచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే 100రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పి రెండేళ్లు గడిచినా ఎంత వరకు ఆ హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఫెన్షన్లు పెంపు, రైతు భరోసా, యువ వికాసం కింద రూ.5లక్షల వరకు విద్యభరోసా కార్డు, వరి పంటకు రూ.500 బోనస్, మహిళలకు ప్రతినెల రూ.2500 తదితర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా మండల అధ్యక్షులు కాలసాని పరశురామ్, మండల ఎస్సీమోర్చా నాయకులు బల్లిపోగు నరేష్, దొంతబోయిన సురేష్, మరిది రామారావు తదితరులు పాల్గొన్నారు.